
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 6 జనవరి 2025



మొదటి విజేతకు బహుమతి అందజేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ



ప్రథమ బహుమతి ముగ్గు



ఉషికల ప్రీతి, ఖమ్మం (రూ.6వేలు)



ద్వితీయ బహుమతి ముగ్గు



మారోజు నీరజ, ముదిగొండ (రూ.4వేలు)



తృతీయ బహుమతి ముగ్గు



ముమ్మడి పుష్పావతి, ఖమ్మం (రూ.3వేలు)



ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో జరిగిన ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ముగ్గుల పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

మురిపించిన రంగవల్లులు

ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

- పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళా లోకం
- ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్‌లో సందడే సందడి
- సంస్కృతీ సంప్రదాయాలను కళ్లకు కట్టిన ముగ్గులు
- పోటాపోటీగా అద్భుతమైన ముగ్గులు వేసిన మహిళలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముచ్చటైన ముగ్గులు.. అందమైన రంగులు.. చక్కని సందేశాలు... ఆకట్టుకునే అలంకరణలు. రంగుల సింగిడి నేలపైన పరుచుకుందా అన్నట్టు.. ఇలపైన ఇంద్రధనస్సు వెల్లివిరిసిందా అన్నట్టు.. రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఖమ్మం నగరంలో సంక్రాంతి ముగ్గుల సందడి ముందే ఆవిష్కృతమైంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్).. ఆదివారం ఖమ్మంలోని ప్రభుత్వ రిక్కాబజార్ హైస్కూల్‌లో కన్నుల పండువగా జరిగాయి. ప్రియదర్శిని గ్రూప్ (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న నగర మేయర్ నీరజ



'ప్రియదర్శిని' అధినేత కాటేపల్లి నవీన్



ఆంధ్రజ్యోతి బ్రాంచ్‌మేనేజర్ పుల్లారావు

ముగ్గుల కళను కాపాడుకోవాలి

- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేస్తున్న కృషి అభినందనీయం
- మన గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవి
- నగర మేయర్ పునుకొల్లు నీరజ
- ఆడపిల్లల్లో సృజనాత్మకత పెంపొందుతుంది: 'ప్రియదర్శిని' అధినేత కాటేపల్లి నవీన్‌బాబు
- ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవం

6

పరశురాముడిగా భద్రాద్రి రామయ్య



భద్రాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీసీతారామచంద్రస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమివ్వగా స్వామివారిని తిలకించిన భక్తులు పులకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పరశురామావతారాన్ని అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణ, భాజభజంత్రీలు, మహిళా భక్తుల కోలాటాల నడుమ స్వామివారిని మిథిలా (మిగతా 6వ పేజీలో)

వణికిస్తున్న చలి పులి

- ఏజెన్సీలో అత్యల్ప ఉష్ణోగ్రతల నమోదు
- బయటకు రాలేకపోతున్న వృద్ధులు, పిల్లలు

6

ప్రభుత్వ వ్యవస్థల్లో నిర్లక్ష్యానికి పరాకాష్ట రాజీవ్ స్వగృహ కల్ప భవనాల వ్యవహారం.. కోట్లు వెచ్చించి ఇళ్లు నిర్మించి అసంపూర్తిగా వదిలివేయడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకోకపోవడంతో విలువైన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిపోతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఖమ్మం నగర సమీపంలో రాజీవ్ స్వగృహపేరుతో నిర్మించిన ఇళ్లు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా వీటిని వినియోగంలోకి తీసుకురాలేకపోవడం శోచనీయం. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇకనైనా రాజీవ్‌స్వగృహ ఇళ్లకు మోక్షం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



నిలువెత్తు నిర్లక్ష్యం!

- 16 ఏళ్లవుతున్నా 'రాజీవ్ స్వగృహ'కు మోక్షం కరువు
- శిథిలావస్థకు చేరుతున్న అపార్ట్‌మెంట్ భవన సముదాయాలు
- వేలం నిర్వహణలో యంత్రాంగం తీవ్ర జాప్యం
- అధిక ధరల వల్లనే ముందుకురాని కొనుగోలుదారులు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా

ఖమ్మం, జనవరి 5(ఆంధ్రజ్యోతిప్రతినిధి): మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ స్వగృహ పేరుతో ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి పంచాయతీ పరిధిలో సుమారు రూ.60కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇల్లులేని ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు, ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రభుత్వం నుంచి ఆయా ఇళ్లను కొనుగోలు చేసి లబ్ధిపొందేందుకు ఈ రాజీవ్ స్వగృహ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మంరూరల్ మండలంలో ఈ అపార్టుమెంట్లు నిర్మించారు.

వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి రఘునాథపాలెం మండలంలో సుమారు 100ఎకరాలు గుర్తించినా తర్వాత నిర్మాణాలు చేపట్టకపోవడంతో రద్దుచేశారు. అపార్టుమెంట్లను పూర్తిచేసి మధ్యతరగతి ఉద్యోగులకు ఇవ్వాలని, నిర్ణయించి ఒక్కొక్కరి నుంచి అప్పట్లో మీ-సేవా ద్వారా రూ.3,500వరకు వసూలు చేసి పేర్లు నమోదు చేయించారు. ఆ తర్వాత పోలేపల్లి వద్ద మొత్తం 16ఎకరాల్లో 7లక్షల 60వేల స్క్వేర్‌ఫీట్లతో 9ఫ్లోర్లతో ఒక్కొక్క ఫ్లోర్‌లో 8ప్లాట్లు ఉండేలా అపార్టుమెంట్లు నిర్మించాలని నిర్ణయించారు. ముందు డబుల్‌బెడ్‌రూంకు సంబంధించి 288, త్రిబుల్‌బెడ్‌రూంకు 288, మొత్తం 576 ప్లాట్లు మొదటగా నిర్మించారు. అయితే నిర్మాణం 60శాతం మాత్రమే పూర్తయింది. ఎక్కడా ప్లాస్టింగ్ ఎలక్ట్రికల్‌వర్క్, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు, రోడ్లు, కాంపౌండ్‌వాల్, స్విమ్మింగ్‌పూల్, డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్ వంటి ఇతర సదుపాయాలు నిర్మించాల్సి ఉన్నా ఆయా పనులు చేపట్టలేదు. 2008లో ప్రారంభించిన పనులు అసంపూర్తిగానే మిగిలాయి.

రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన ఈ పనులు ప్రభుత్వాలు మారడం, బుకింగ్ చేసుకున్న వారు అడ్వాన్స్ సొమ్ము ఇవ్వకపోవడంతో రాజీవ్‌స్వగృహ ముందుకు కదలలేదు. అప్పట్లో ప్రభుత్వ నిర్వహణలో నిర్మాణ వ్యయం స్క్వేర్‌ఫీట్‌కు రూ.1,800 వరకు (మిగతా 6వ పేజీలో)

ప్రాణం తీసుకున్న కళాశాల టాపర్

- వారాంతపు పరీక్షల్లో తక్కువ మార్కులు
- అధ్యాపకులు మందలించడంతో మనస్తాపం
- నానమ్మ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య
- కళాశాల వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ



రాంపవార్(ఫైల్)

చుంచుపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అతడు కళాశాల టాపర్.. కానీ ఇటీవల వారాంతపు పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తుండటంతో అధ్యాపకులు మందలించారు. దీంతో మనస్తాపానికి లోనైన సదరు విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చుంచుపల్లి మండలం విద్యానగర్‌కాలనీ పంచాయతీలో ఆదివారం జరిగింది. అయితే తమ కుమారుడి ఆత్మహత్యకు కళాశాల వేధింపులే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి చుంచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలం నందాతండాలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన శనగ రాంపవార్(18) విద్యానగర్‌కాలనీ పంచాయతీలో నాయనమ్మ-తాతయ్యల వద్ద ఉంటూ లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఫస్టియర్‌లో 464 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. అయితే కళాశాలలో ప్రత్యేక సెక్షన్(ప్రతిభావంతులు)లో ఉన్న అతడు ప్రతిరోజు తరగతులకు హాజరవుతున్నాడు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన వారాంతపు పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో అధ్యాపకులు మందలించి, తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. ఇలా మరోసారి జరిగితే వేరే సెక్షన్‌లో వేస్తామని తెలిపారు. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి లోనైన రాంపవార్ పది రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి చదువుకుంటున్నాడు. ఇది గమనించిన అధ్యాపకులు కళాశాలకు రావాలని విద్యార్థికి, అతడి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. లేనిపక్షంలో వార్షిక పరీక్షలకు హాల్‌టికెట్ ఇవ్వబోమని హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి లోనైన రాంపవార్ ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అయితే తమ కుమారుడు కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆస్పత్రి మార్చురీ వద్ద తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతదేహాన్ని అప్పగించారు. ఈ ఘటనతో లక్ష్మీదేవిపల్లిలోని సదరు విద్యార్థి చదివే ప్రైవేటు కళాశాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి తండ్రి వెంకటలక్ష్మణ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చుంచుపల్లి ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

సెల్ఫీ పాయింట్ @ గోదావరి



భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 9న పవిత్ర గోదావరిలో స్వామి వారికి నిర్వహించే తెప్పోత్సవం సమయంలో వచ్చే పర్యాటకులు, భక్తులకోసం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ ఆకట్టుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవతో ఈ సెల్ఫీ పాయింట్‌ను తొలిసారిగా ఏర్పాటు చేశారు. దీనికి విద్యుత్తు దీపాల అలంకరణతో ప్రత్యేక శోభ సంతరించుకుంది.

-ఆంధ్రజ్యోతి, భద్రాచలం



బాబోయ్.. బ్యాక్‌వాటర్

- పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని నది, మొర్రేడు వాగులకు ఎగపోటు
- పరివాహకంలో వేల ఎకరాలకు ముంపు ముప్పు

7

సాగర్ కాల్వ వద్ద సెల్ఫీ దిగుతూ...

- నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు
- మరొకరిని కాపాడిన పశువుల కాపరి



పరిమి శివ (ఫైల్)

కల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వ వద్ద సెల్ఫీ దిగుతూ ప్రమాదవశాత్తు ఓ యువకుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మరో యువకుడిని పశువుల కాపరి కాపాడిన సంఘటన కల్లూరు మండల పరిధిలోని పడమట లోకవరం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి... పడమట లోకవరం గ్రామానికి చెందిన పరిమి శివ(19) తన స్నేహితులైన సంపత్, (గోకవరం గ్రామం) కళ్యాణ్ (కల్లూరు) కలిసి ఆదివారం సెల్ఫీ దిగేందుకు సాగర్ కాల్వ వద్దకు ఉదయం 10గంటల సమయంలో వెళ్లారు. ఈ క్రమంలో పరిమి శివ, సంపత్ సెల్ఫీ దిగేందుకు కాల్వలోకి దిగారు. ఇదే సమయంలో కళ్యాణ్ కాల్వ కట్టపై ఉన్నాడు. అయితే కాల్వలో దిగిన శివ, సంపత్‌లు ప్రమాదవశాత్తు జారిపడి నీటి మునిగారు. ఈ ఘటనలో శివ కాల్వలో గల్లంతు కాగా, కాల్వ సమీపాన ఉన్న ఓ పశువుల కాపరి గమనించి కర్ర సహాయంతో సంపత్‌ను కాపాడాడు. గల్లంతైన శివ కోసం గ్రామస్థులు గాలించిన కాల్వ నీటి ఉధృతితో ఆచూకీ కనిపించలేదు. కాగా గల్లంతైన శివ కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి విజయతోపాటుగా ఓ కుమార్తె ఉంది. తల్లి విజయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.



ముత్యాల ముగ్గుల పోటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ





ముగ్గులు వేస్తున్న మహిళలు

ముందే వచ్చిన సంక్రాంతి

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం ఖమ్మంలోని ప్రభుత్వ రిక్కాబజార్ హైస్కూల్‌లో ఉత్సాహంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. అందమైన ఆకృతులతో పోటాపోటీగా వేసిన ముగ్గులు అలరించాయి. విజేతలకు అతిథులు నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీలతో సంక్రాంతి శోభ ముందే సాక్షాత్కరించినట్లయింది.



ద్వితీయ విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ అధినేత కాటేపల్లి నవీన్‌బాబు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



తృతీయ విజేతకు బహుమతి అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచి మేనేజర్ తాళ్లూరి పుల్లారావు.



పేర్లు నమోదు చేస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది



ముగ్గులను పరిశీలిస్తున్న దృశ్యం





ముగ్గులు వేస్తున్న చిన్నారులు

మురిపించిన రంగవల్లులు

చాలా ఆనందంగా ఉంది...

ఉషికెల ప్రీతి, మొదటి బహుమతి విజేత

ఆంధ్రజ్యోతి ముగ్గులపోటీల్లో మొదటి బహుమతి దక్కటం ఎంతో ఆనందంగా ఉంది. నేను గతంలో చాలా పోటీల్లో పాల్గొన్నాను. కానీ బహుమతి పొందటం ఇదే మొదటిసారి. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ముగ్గుల పోటీ నిర్వహించటం అభినందనీయం.

నమ్మకం వృథా కాలేదు..

మారోజు నీరజ, ద్వితీయ విజేత

ఆంధ్రజ్యోతి పోటీల్లో ప్రతిభకే పట్టం కడతారన్న నా నమ్మకం వృథాకాలేదు. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొని గతంలో చాలాసార్లు బహుమతులు పొందాను. గతేడాది రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ విజేతగా నిలిచాను. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా పోటీలు నిర్వహించటం ఎంతో అభినందనీయం.

ఆత్మవిశ్వాసం పెంపొందింది..

ముమ్మడి పుష్పావతి, తృతీయ విజేత

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో బహుమతి గెలుపొందటం వల్ల నాలో ఆత్మవిశ్వాసం ఎంతో పెంపొందింది. ముగ్గులు వేయటం ఎంతో ఇష్టం, పోటీల్లో పాల్గొనటం ద్వారా నా సృజనాత్మకతను పెంచుకోవాలనుకుంటున్నాను. మున్ముందు ఇతర పోటీల్లో మంచి స్థానం సాధించగలనన్న నమ్మకం కలిగింది.

(5వ పేజీ తరువాయి)

ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో యువతులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేశారు. ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా పలు మండలాలనుంచి మహిళలు తరలివచ్చారు. మొత్తం 108మంది పోటీల్లో పాల్గొని ముగ్గులను వేశారు..

ముందేవచ్చిన సంక్రాంతి శోభ..

ముగ్గుల కళను వెలికి తీసేందుకు ఆంధ్రజ్యోతి ఇచ్చిన అవకాశాన్ని మహిళలు అందిపుచ్చుకొని తమలోని సృజనాత్మకతకు పదును పెట్టారు. చుక్కలు, మెలికల గీతలతో అందమైన ఆకృతులను రూపొందించారు. మహిళల వేలి కొసల అద్భుత చిత్రకళతో అంతవరకు మట్టితో నిండి ఉన్న ప్రాంగణం కొద్ది సమయంలోనే రంగురంగుల చూడచక్కని తివాచీలా మారింది.. రంగు సింగిడి నేలకొంగినట్లు పలు వరుసల్లో ముగ్గులను రంగురంగుల్లో నింపి నేలను ఇంద్రధనుస్సుగా మార్చారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు ముగ్గులను వేయటమేకాక సామాజిక సందేశాన్నిచ్చే విధంగా ముగ్గులను తీర్చిదిద్దారు.ముగ్గులకు తగినట్లుగా పలు రంగులను అద్దారు.. హరిదాసులు, కోడి పుంజులు, చెరకు గడలు, పాడిపంటలు, పొంగళ్ల, భోగి మంటలు, గాలి పటాలు, గంగిరెద్దులు సంక్రాంతి ప్రాశస్త్యాన్ని, పండుగపరమార్థాన్ని ప్రతిబింబించే అనేక చిత్రాలను ముగ్గుల్లో పొందుపరిచారు. చైనా వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండండి, మాస్క్ ధరించండి, ఆడపిల్లను రక్షించుదాం, చెట్లను కాపాడుదాం, అక్షరాస్యత పెంచుదాం, సత్యమేవ జయతే, జైజవాన్, జైకిసాన్ తదితర నినాదాలతో ముగ్గులను అందంగా అలంకరించారు.

తమ వెంట తమ చిన్నారులను సైతం తీసుకురావటంతో ముగ్గుల కళను భవిష్యత్ తరాల వారికి పరిచయం చేసినట్లయ్యింది.

విజేతలు వీరే...

ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో.. ప్రథమ విజేతగా ఖమ్మంకు చెందిన ఉషికల ప్రీతి, ద్వితీయ విజేతగా ముదిగొండ గ్రామానికి చెందిన మారోజు నీరజ, తృతీయ విజేతగా ఖమ్మంకు చెందిన ముమ్మడి పుష్పావతి నిలిచారు. వీరితోపాటు ఎం. శ్వేత, మమత, లక్ష్మీప్రవంతి, రాజ్యలక్ష్మి, సింధు కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారు. మొదటి బహుమతి విజేతకు నగర మేయర్ పునుకొల్లు నీరజ, ద్వితీయ విజేతకు ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేతలు కాటేపల్లి నవీన్‌బాబు, నళిని దంపతులు, తృతీయ విజేతకు ఆంధ్రజ్యోతి ఖమ్మం యూనిట్ మేనేజర్ టి.పుల్లారావు బహుమతులు అందజేశారు.

సందడిగా, సంబురంగా..

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీతో రిక్కాబజార్ హైస్కూల్ ప్రాంగణం వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. ప్రియదర్శిని విద్యాసంస్థలకు చెందిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు హాజరుకాగా, తమ స్నేహితురాళ్ల ముగ్గుల ప్రావీణ్యాన్ని తిలకించేందుకు వారి తోటి విద్యార్థినులు వెంట వచ్చారు. మహిళలు ఎంతో ఆసక్తిగా పోటీలు జరిగే ప్రాంగణానికి తమ భర్త, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ముగ్గుల పోటీ అనంతరం బహుమతుల ప్రదానోత్సవ సభపై కొందరు యువతులు పాటలు పాడగా జ్యోతి అనే మహిళ 'భరత వేదమిది...' అనే సినీ గీతానికి శాస్త్రీయ నృత్యాన్ని అభినయించి స్ఫూర్తిని చాటారు. విజేతలతోపాటు పాల్గొన్న ప్రతిఒక్కరికీ గిఫ్ట్ హ్యాంపర్ అందజేయటంతో సంతోషించారు. కార్యక్రమం ముగింపులో అక్కడే భోజనాలు చేసి ఆనందంగా వెనుదిరిగారు. ఈ పోటీలకు జడ్జీలుగా జిల్లా బాలల సంరక్షణ అభివృద్ధి అధికారి కుతుంబాక విష్ణువందన, అభినవ్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ పారుపల్లి అరుణ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శ్రీరాంశెట్టి మాధవి వ్యవహరించారు.

ముగ్గుల కళను కాపాడుకోవాలి...

నగర మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సమాజానికి నిఖార్సైన వార్తలు అందించటమే కాక, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని నగర మేయర్ పునుకొల్లు నీరజ కొనియాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)... ఆదివారం ఖమ్మంలోని ప్రభుత్వ రిక్కాబజార్ హైస్కూల్‌లో కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ చూస్తుంటే తనకు చిన్ననాటి గ్రామీణ సంస్కృతి కళ్ల ముందు సాక్షాత్కరించిందన్నారు. ఇంటిని చూసి ఇల్లాలిని చూడు అన్న సామెత చందంగా గతంలో విశాలమైన వాకిళ్లలో పెద్ద పెద్ద ముగ్గులు వేసేవారమన్నారు. నగరాల్లో, ఆధునిక కాలంలో ముగ్గుల సంస్కృతి తగ్గుతున్న సమయంలో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ కారణంగా తిరిగి ఆ సంస్కృతికి ప్రాణం పోసినట్లు అవుతుందన్నారు.

ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ అధినేత కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతూ ముగ్గుల కళ వల్ల ఆడపిల్లల్లో సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. నిజాయితీగా వార్తలు రాస్తూ నిజాలు వెలికి తీస్తూ దమ్మున్న పత్రికగా పేరు పొందిన ఆంధ్రజ్యోతి... ఆడపిల్లల సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాన్ని చేపట్టినందుకు అభినందిస్తున్నానని చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచి మేనేజర్ తాళ్లూరి పుల్లారావు మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటిచెప్పేందుకు ఆంధ్రజ్యోతి దినపత్రిక ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకునేలా సంసిద్ధం అయ్యేందుకు ఈ పోటీలు మహిళలకు ఉపయోగపడతాయని అన్నారు. ముగ్గుల కళలోని గొప్పతనం ఈ పోటీల ద్వారా ఈ తరం యువతులకు అవగతం అవుతుందని అన్నారు.

ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి మాట్లాడుతూ ముగ్గులు వేయటంలో సైన్స్ దాగి ఉందని, ఉదయం వేళ ముగ్గులు వేయడమంటే ఒకరకంగా యోగా చేసినట్టేనని అన్నారు. యువతులు ముగ్గుల కళపై అవగాహన పెంపొందించుకోవటంతోపాటు జీవన విధానంలో భాగం చేసుకోవాలన్నారు.

స్మార్ట్ ఫోన్ల కారణంగా ముగ్గుల కళ కొడిగట్టుకుపోతున్న తరుణంలో, దానిని పునరుజ్జీవింప చేసేందుకు ఆంధ్రజ్యోతి గత రెండు దశాబ్దాలుగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. బ్యూరో ఇన్‌చార్జి నలజాల వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా అభిమాన పాఠకులను విలువైన కానుకలతో సత్కరించటంతో పాటు మహిళల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేతలు కాటేపల్లి నళిని, అప్పారావు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ శ్రీధర్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ తాళ్లూరి రమేష్, సర్క్యులేషన్ మేనేజర్ సూర్యనారాయణ రిపోర్టర్లు సాయిరాం ప్రసాద్, రాఘవ, రాము, శ్రీనివాస్, నాగేశ్వరరావు, నరసింహారావు, శబరీష్, వెంకటాద్రి, సబ్ ఎడిటర్లు కాంకూరి వెంకటేశ్వరరావు, పాల రమేష్, బాలకృష్ణ, ఫొటోగ్రాఫర్ రవిశంకర్ తదితరులతో పాటు సిబ్బంది శిరీష, లక్ష్మి, ఎకౌంటెంట్ అప్పారావు, షెడ్యూలింగ్ ఇంచార్జి కందుకూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

ధర నిర్ణయించగా 2008 ప్రాంతంలో ప్రైవేటులో రూ.1,000నుంచి రూ.1,200 వరకు మాత్రమే ఉండడంతో రాజీవ్ స్వగృహవైపు ఎవ్వరూ కన్నెత్తి కూడా చూడలేదు. మీ-సేవ ద్వారా బుకింగ్ చేసుకున్న వారు కూడా అధిక ధరలు చూసి ముందుకు రాలేదు. కాలక్రమేణా నిర్మాణాలు వ్యయాలు పెరగడంతో ఇప్పుడు స్క్వేర్‌ఫీట్ ధరలు రెట్టింపయ్యాయి.

శిథిలావస్థకు భవనాలు..

నిర్మాణం ప్రారంభించి 16 సంవత్సరాలవుతున్నా ఈ భవనాలు పూర్తిచేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇంకా సింగిల్ బెడ్‌రూం ఫ్లోర్‌లు నిర్మించాల్సి ఉంది. మున్నేరు పక్కన నీటి సమస్యలేని ప్రాంతంలో ఈ రాజీవ్ స్వగృహ భవనాలు నిర్మించినా ప్రభుత్వం దీనిపై పర్యవేక్షణ లేకపోవడం, పనులు పూర్తిచేయకపోవడతో ఈ పథకం ఆదిలోనే ఆగిపోయింది. బ్యాంకులనుంచి తెచ్చిన. అప్పలు వడ్డీలకు వడ్డీలు పెరిగాయి. పూర్తిగా బ్యాంకు రుణాలతోనే ఈ పథకాన్ని నిర్మించారు. గతంలో ఒకటి రెండుసార్లు యథాస్థితిలో కొనుగోలు చేయాలని కలెక్టర్లు టెండర్‌కు వెళ్లినా ఎవరూ ముందుకు రాలేదు.

మొత్తం 16 ఎకరాల్లో చేపట్టిన మొత్తం నిర్మాణాలను తీసుకుంటాం కానీ విడిగా ప్లాట్లు కొనుగోలు చేస్తే పూర్తిచేయడం కష్టమని ఎవ్వరూ ముందుకు రాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారుల సంఘాలు, జర్నలిస్టులు తమకు ప్రభుత్వం ఈ భవనాలు ఇస్తే కొనుగోలుచేస్తామని దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం టెండర్ల నిర్వహించినా ఆ ధరలు చూసి ఎవరూ ముందుకు పోలేదు. రాజీవ్‌స్వగృహ వాస్తవ పరిస్థితికి భిన్నంగా ప్రభుత్వ లెక్కల ప్రకారంగా ధరలు నిర్ణయించడంతో టెండర్లు రాలేదు.

మళ్లీ తెరపైకి రాజీవ్ స్వగృహ

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న రాజీవ్‌స్వగృహప్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తామని పేర్కొంది. ఇందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ఇళ్లు నిర్మించి అసంపూర్తిగా వదిలేసి 16 ఏళ్ల కాలం దాటింది. దీంతో ఇళ్ల నాణ్యత ప్రమాణాలు దెబ్బతిన్నాయి. మళ్లీ వాటిని పునఃప్రారంభించాలంటే కొనుగోలుదారులకు తలకుమించిన భారమే అవుతుంది. ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా రాజీవ్‌స్వగృహను తీసుకునేందుకు ఉత్సాహం చూపడంలేదు. డిజైన్లు, నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా ఉండడం, ప్రభుత్వం చెప్పే ధరలకు వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉండడంతో రియల్‌ఎస్టేట్ సంస్థలు కూడా ఆసక్తి చూపడం లేదు. గతంలో ఉద్యోగ సంఘాలు రాజీవ్‌స్వగృహ తీసుకునేందుకు ముందుకు వచ్చినా ధర గిట్టుబాటు కాక ముందుకు సాగలేదు. రాజీవ్ స్వగృహను సెకండ్‌సేల్‌గా భావించి ధరలు తగ్గిస్తే తాము తీసుకుంటామని ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. అయితే ప్రభుత్వం రాజీవ్‌స్వగృహపై తీసుకునే నిర్ణయాన్ని బట్టి వీటిని విక్రయించడమా లేక అలా వదిలేయడమా తేలనుంది.

వణికిస్తున్న చలి పులి

కొత్తగూడెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గజగజ వణుకుతోంది. సాయంత్రం 4గంటల నుంచే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం సమయంలో 7గంటలు అవుతున్న చలితీవ్రత తగ్గడం లేదు. గత మూడు రోజులుగా చలి పెరిగిపోవడంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేకపోతున్నారు. బయటకు వస్తే చలిగాలులు వీచడంతో ప్రతీ ఒక్కరికి విపరీతమైన జలుబు, తుమ్ములు, దగ్గు తదితర వ్యాధులు సోకుతున్నాయి. జిల్లాలోని పినపాక, భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, పాల్వంచ, ములకలపల్లి, ఆళ్లపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, మణుగూరు, కరకగూడెం, జూలూరుపాడు, సుజాతనగర్, చంద్రుగొండ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో అత్యధికంగా చలిగాలులు వీస్తున్నాయి. కొందరు వృద్ధులు చలితీవ్రతను తట్టుకోలేక దుప్పట్లను కప్పుకుని సేదతీరుతున్నారు. మరి కొంత మంది చలి మంటలు వేసుకుంటున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మొత్తం మీద గత నాలుగు రోజుల నుంచి చలిగాలులు వీస్తోన్నాయి. రోజు అత్యధిక ఉష్ణోగ్రతలు 20 నుంచి 25డిగ్రీలు నమోదు కాగా అత్యల్పంగా 10 నుంచి 15డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. యువతీ, యువకులు చలిని తట్టుకునేందుకు స్వెటర్లు ధరిస్తున్నారు.

పరశురాముడిగా భద్రాద్రి రామయ్య

(5వ పేజీ తరువాయి)

స్టేడియం ప్రాంగణంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి నివేదన చేశారు. ఈ సమయంలో భక్తులు స్వామివారిని భక్తిప్రపత్తులతో తిలకించి తరించారు. అనంతరం స్వామి వారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. సోమవారం స్వామి వారు శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థసారథి ఆలపించిన ఆధ్యాత్మిక పాటలు, గీతాలు ఆహూతులను భక్తితన్మయత్వంలో ఓలలాడించాయి. అదిగో అదిగో భద్రగిరి ఆంధ్రజాతికి ఇది అయోధ్యపురితో పాటు పలు భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను సైతం ఆలపించారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

ఆయిల్‌పామ్‌తో అధిక నూనె దిగుబడి

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

సత్తుపల్లిరూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అత్యధికంగా వంటనూనె దిగుబడి ఇచ్చే పంటల్లో ఆయిల్‌పామ్ ప్రధానమైందని, ఈ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని రేగళ్లపాడులోని ఆయిల్‌ఫామ్ నర్సరీని ఆకస్మికంగా క్షేత్రస్థాయి పర్యటన చేశారు. నర్సరీలో ఆయా స్టేజీలలో ఉన్న మొక్కలను పరిశీలించి స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. రైతులకు అందిస్తున్న మొక్కల వివరాలతో పాటు పాటించాల్సిన పంట రక్షణ పద్ధతులను నిర్వాహకులు, అధికారులకు వివరించారు.

బాబోయ్.. బ్యాక్‌వాటర్



కిన్నెరసాని వరద ప్రవాహం(ఫైల్)

- పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని నది, మొర్రేడు వాగులకు ఎగపోటు
- పరివాహకంలో వేల ఎకరాలకు ముంపు ముప్పు

కొత్తగూడెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో తెలంగాణలో ఏర్పడే ముంపుపై ఐఐటీ హైదరాబాద్‌తో అధ్యయనం చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 150 అడుగుల్లో నీటిని విడుదల చేస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని, మొర్రేడువాగులకు ఎగ పోటు వేస్తుంది. 2022 ఆగస్టులో వచ్చిన వరద ఉధృతి ప్రధానంగా అంచనా వేయవచ్చు.

1986లో వరద ఎక్కువ

1986లో ఎగువ ప్రాంతం నుంచి 27లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో భద్రాచలం బ్రిడ్జి వద్ద 76.5 అడుగుల ఎత్తులో గోదావరి నీటి మట్టం చేరింది. అప్పట్లో ముంపు ప్రాంతం తక్కువగానే ఉందనే అంచనా వేశారు. అప్పటి గోదావరి ప్రవాహం కిన్నెరసాని, మొర్రేడువాగులకు ఎగపోటు వేయలేదు. పరివాహక ప్రాంతాలు మాత్రమే ముంపునకు గురయ్యాయి.

2022లో ముంపు ఎక్కువ

2022 ఆగస్టులో వచ్చిన గోదావరి భద్రాచలం వద్ద 24.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో 71అడుగులకు చేరింది. 1986లో వచ్చిన గోదావరి కన్న రెండేళ్ల క్రితం వచ్చిన గోదావరి ఎక్కువ ముంపు ప్రభావాన్ని చూపించింది. సుమారు 106 గ్రామాలు ముంపునకు గురి కాగా 20వేల ఇళ్లు నీట మునిగాయి. పోలవరం ప్రాజెక్టు ప్రభావం చూపించడం వల్లనే ముంపు ఎక్కువైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ఎగపోటు వల్ల కిన్నెరసాని, మొర్రేడు వాగుల నీరు వెనక్కి చేరడంతో ముంపు తీవ్రత ఎక్కువైంది.

ఎగపోటుతో ప్రమాదం..

కిన్నెరసాని ప్రాజెక్టులో 7టీఎంసీల నీటిని నిల్వ ఉంచిన తర్వాత ఆపై వచ్చిన నీటిని విడుదల చేస్తుంటారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి వదిలిన నీరు 24 కిలోమీటర్ల ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తుంది. పాల్వంచ, బూర్గంపాడు మండలాల నుంచి ఆంధ్రాలోని వేలేరు గ్రామం మీదుగా గోదావరిలో నీరు చేరుతుంది.

మొర్రేడు 14 కిలోమీటర్ల పరిధిలో నుంచి ప్రవహిస్తూ వేలేరే వద్దనే కిన్నెరసాని, మొర్రేడు సంగమంగా గోదావరికి చేరుతోంది. మొర్రేడుకు ఉపవాగులుగా ఉన్న పాములేరు, మూకమామిడి అలుగు, పెద్దవాగు అలుగు నీరు కూడా మొర్రేడులో చేరి గోదావరిలో కలుస్తుంది. మొత్తంగా 22 గ్రామాలు కిన్నెరసాని, మొర్రేడు పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. 3,500 ఎకరాల భూములు 2022లో ఆగస్టులో వచ్చిన గోదావరి ముంపునకు గురయ్యాయి. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ వల్ల కిన్నెరసాని, మొర్రేడులకు ఎగపోటు వేస్తుందనే ఆందోళన ఉంది.

మెప్మా ఆర్పీలకు తీపి కబురు

- 242మందికి రూ.84 లక్షల పెండింగ్ వేతనాల విడుదల
- సమస్యను పరిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మిషన్ ఫర్ ఎలిమేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిప్ ఏరియాస్(మెప్మా) పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లకు వేతనాల చిక్కుముడి వీడింది. మున్సిపాలిటీల నుంచి ఇవ్వాలని ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆర్థికంబగా బలంగా ఉన్న ఖమ్మం నగర పాలక సంస్థ ఆర్పీల వేతనాలను అందించేందుకు బిల్లులు సిద్ధం చేసింది. కాని వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలు మాత్రం ఆర్థిక ఇబ్బందులతో ముందడుగు పడలేదు.

రూ. 84లక్షల విడుదల

మెప్మాలోని రిసోర్స్‌పర్సన్‌లకు జూన్ నెల నుంచి గౌరవ వేతనాలు బకాయిలు ఉన్నాయి. ఒక్కో ఆర్పీకు నెలకు రూ.6వేలు గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఇస్తుంది. ఖమ్మంలో 165 మంది, మధిరలో 28, సత్తుపల్లిలో 24, వైరాలో 24 మందికి జూన్ నుంచి డిసెంబర్ వరకు వేతనాలు అందలేదు. అయితే శనివారం మెప్మా ఎండీ పెండింగ్ వేతనాలను విడుదల చేశారు. దీంతో జిల్లాలో 242 మంది ఆర్పీలకు రూ.84 లక్షల పెండింగ్ వేతనాలు పీడీ బ్యాంకు ఖాతాకు జమఅయ్యాయి.

ఇటీవల ఆర్పీలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన మంత్రి ఆర్పీలకు ఆరు నెలల పెండింగ్ వేతనాలను మంజూరు చేయించారు.

హంస వాహనం ట్రయల్‌రన్ సక్సెస్

భద్రాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 9న పవిత్ర గోదావరిలో రామయ్యకు నిర్వహించనున్న తెప్పోత్సవానికి మార్గం సుగమం అయ్యింది. హంసాలంకృత తెప్పపై 9 సాయంత్రం గోదావరిలో ఐదు పర్యాయాలు స్వామి వారు విహరించనున్నారు. ఈ క్రమంలో ఆదివారం హంస వాహనం ట్రయల్ రన్‌ను నిర్వహించగా అది విజయవంతమైంది. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావుతో పాటు ఇతర అధికారులు ట్రయల్‌రన్‌ను పరిశీలించారు. హంసాలంకృత తెప్ప వెళ్లే మార్గంలో ట్రయల్ రన్‌ను నిర్వహించగా పూర్తిగా ఎటువంటి సమస్యలు లేకుండా విజయవంతం కావడంతో హంస వాహనం ట్రయల్ రన్ సక్సెస్ అయినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం, నీటిపారుదల శాఖ, రెవిన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

కేయూ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా విశాల్‌యాదవ్



ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా నగరానికి చెందిన విశాల్‌యాదవ్ ఎంపికయ్యాడు. విశాల్‌యాదవ్ స్వస్థలం ఖమ్మం నగరం ఆయన తండ్రి కొండయ్య ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్‌గా నగరంలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా విశాల్‌యాదవ్ వరంగల్‌లోని వాగ్దేవి కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత మూడు రోజులుగా జరిగిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీల్లో వరంగల్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించాడు. ఖమ్మం జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విశాల్ 35 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 70 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రతి మ్యాచ్‌లోనూ సత్తా చాటుతుండటంతో విశాల్‌యాదవ్‌కు యూనివర్సిటీ సెలెక్షన్ కమిటీ జట్టు పగ్గాలు అప్పగించింది. విశాల్‌యాదవ్ కెప్టెన్‌గా నియమితులవడం పట్ల డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తదితరులు అభినందించారు.

శాతవాహన యూనివర్సిటీ

రిజిస్ట్రార్‌గా కొణిజర్ల వాసి

బాధ్యతలు స్వీకరించిన రవికుమార్



కొణిజర్ల, జనవరి5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కొణిజర్ల మండలం గోపవరం గ్రామానికి చెందిన జాస్తి రవికుమార్ ఈనెల 4వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్ పదో తరగతి వరకు కొణిజర్లలో ఇంటర్, డిగ్రీ ఖమ్మంలో పూర్తి చేశారు. ఎంకామ్, ఎంబీఏ, పీహెచ్‌డీని పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, సికింద్రాబాద్ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా, ఎగ్జామినేషన్ బ్రాంచ్ అడిషనల్ కంట్రోలర్‌గా, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్‌గా, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌గా 24ఏళ్ల పాటు వివిధ పదవుల్లో సేవలను అందించారు.

రైతు కుటుంబం...

గోపవరం గ్రామానికి చెందిన రైతు దంపతులు జాస్తి పురుషోత్తం, నాగరత్నంల కుమారుడు రవికుమార్. రవికుమార్ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 40 వరకు పరిశోధనా పత్రాలు ప్రచురించగా, ఏడు పుస్తకాలు రచించారు. అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ఆయన వద్ద కొంతమంది విద్యార్థులు డాక్టరేట్ శిక్షణ పొందుతున్నారు. రవికుమార్ రిజిస్ట్రార్ అయిన విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు కొణిజర్లకు చెందిన రాయల నరసింహరావు, కొనతం ఉమాశంకర్, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యం: మేయర్ నీరజ



సేంద్రియ కూరగాయల సంతను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం మార్కెట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని నగర మేయర్ పునకొల్లు నీరజ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బ్యాంక్ కాలనీ ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లో గ్రామభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ మేళాను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆమె మాట్లాడారు. క్రిమిసంహారక మందులతో పండించిన పంటలను తినడం వల్ల అనారోగ్యాలకు గురవుతామని అన్నారు. ఆర్గానిక్ మేళా ప్రతి నెల మొదటి ఆదివారం నగరంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కుతుంబాక మాధవి, నరేంద్ర స్వరూప్, బసవ పున్నయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ముష్టిగింజల పట్టివేత

కరకగూడెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం అక్రమంగా వాహనంలో తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల ముష్టి గింజలను సెక్షన్ ఆఫీసర్ గోవింద్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతారంలో అక్రమంగా కొనుగోలు చేసిన ముష్టిగింజలను వాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని ఏడూళ్ల బయ్యారం రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ముష్టి గింజల విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ముగిసిన కేయూ ఇంటర్‌జోన్ క్రికెట్ టోర్నీ



ద్వితీయ బహుమతి సాధించిన ఖమ్మం జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత మూడు రోజులుగా జరిగిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలు ముగిశాయి. పోటీలలో అంతిమ విజేతగా వరంగల్ జోన్ జట్టు నిలవగా ఖమ్మం జోన్ జట్టు రన్నరప్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ఖమ్మం, వరంగల్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 29.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసి విజయం సాధించింది. పోటీల అనంతరం విజేతలకు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేఎండీసీ ప్రిన్సిపాల్ రమణారావు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉపేందర్ ఉన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో బీఫార్మసి విద్యార్థి మృతి

వేంసూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీఫార్మసీ విద్యార్థి మృతిచెందిన సంఘటన వేంసూరులో ఆదివారం చోటుచేసుకుంది. సత్తుపల్లిలోని హనుమాన్‌నగర్‌కు చెందిన షేక్ అఫ్జల్(20) ద్విచక్ర వాహనంపై నూజివీడు వెళ్తుండగా వేంసూరు పెట్రోల్ బంకు నుంచి టీవీఎస్ వాహనం రోడ్డు దాటుతుండగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అఫ్జల్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టీవీఎస్ నడుపుతున్న మర్లపాడుకు చెందిన నాగేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. వేంసూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

రఘునాథపాలెం, జనవరి5(ఆంధ్రజ్యోతి): కోయచెలకకు చెందిన పెనుగొండ విజయ్(43) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. అయితే విజయ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండటంతో తండ్రి అంత్యక్రియలను కుమార్తెలు చేసేందుకు ముందుకు వచ్చారు. కుల పెద్దల అంగీకారం మేరకు పెద్ద కుమార్తె సిరిచందన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. కాగా విజయ్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో విజయ్ స్నేహితుడు నిరంజన్ ఆర్థికంగా ఆదుకున్నారు. అంత్యక్రియలకు రూ.25వేలు వితరణగా అందించారు.

నగరంలో రౌడీషీటర్ అరెస్ట్

ఖమ్మంక్రైం, జనవరి5(ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న రౌడీషీటర్ పేరెల్లి ప్రవీణ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు ఖమ్మం టుటౌన్ సీఐ బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత డిసెంబరులో ఇందిరానగర్ ప్రాంతంలో మునిసిపల్ సిబ్బంది ఆక్రమణలు తొలగిస్తున్న క్రమంలో పేరెల్లి ప్రవీణ్‌తో పాటు అతడి సోదరుడు రవికుమార్ జేసీబీనీ ధ్వంసంచేశారని తెలిపారు. అప్పటినుంచి పరారీలో ఉన్న ప్రవీణ్ వరుస నేరాలకు పాల్పడుతుండగా సెక్షన్ 111 బీఎన్ఎస్ కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

గతంలో ఓ హత్య కేసుతో పాటు హత్యాయత్నం, దోపిడీ వంటి కేసుల్లో నేరం రుజువు కావడంతో అతడికి జీవితఖైదుపడిందని, శిక్ష అనుభవిస్తూ జైలునుంచి విడుదలై తిరిగి మళ్లీ నేరప్రవృత్తి కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఇతడిపై నల్గొండ, ఖమ్మంజిల్లాల్లో 30 కేసులు నమోదుకాగా 21 కేసుల్లో అరెస్టయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడని సీఐ తెలిపారు.

విలేకరిపై పోలీసులకు ఫిర్యాదు

నేలకొండపల్లి, జనవరి5(ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు కథనం రాసి మానసిక క్షోభకు గురి చేసిన ఓ విలేకరిపై పాల వ్యాపారి కసరబోయిన వెంకటేశ్వర్లు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లిలో ఒక్క రోజు కనపడకపోతే అప్పులతో ఉడాయించాడంటూ తనపై కక్షతో, కావాలనే కథనం రాశాడని వాపోయారు. తన పరువుకు భంగం కలిగించాడన్నారు.

తుమ్మల వర్గీయుల ఫ్లెక్సీ చించివేత

పెనుబల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ జన్మదినం సందర్భంగా రింగ్‌సెంటర్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి చిత్రాలతో కాంగ్రెస్ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని కాంగ్రెస్ నాయకుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఆదివారం రాత్రి వీఎంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అభిమాన నాయకుల చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీతో పాటు మంత్రి తుమ్మలకు చెందిన మూడు ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వీఎంబంజర్‌లో కలకలం రేగింది.

జోరుగా మద్యం సిండికేట్ దందా

- వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు...
- ఒక్కో బాటిల్‌పై రూ.50 అదనం

అశ్వారావుపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి దండుకుంటున్నారు. వందలసంఖ్యలో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి బహిరంగంగానే మద్యం విక్రయిస్తున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పైన రూ.50ల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. లైసెన్సు దుకాణాల ఆధ్వర్యంలోనే బెల్ట్‌షాపులను ఏర్పాటు చేశారు. వాటికి ప్రత్యేక వాహనాల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు.

రోజుకు రూ. కోట్ల వ్యాపారం..

అశ్వారావుపేటలో మొత్తం ఆరు లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాలు ఉన్నాయి. లైసెన్సుదారులు అందరూ సిండికేట్‌గా మారారు. రోజు మండలంలో రెండు కోట్లకుపైగ మద్యం వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి. సిండికేట్‌కు అనుబంధంగా గ్రామాల్లో ఒక్కో దానికి లక్ష రూపాయలవరకు డిపాజిట్‌గా తీసుకొని మండలవ్యాప్తంగా 250 వరకు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. మద్యం వ్యాపారులు బెల్ట్‌షాపులకు ఒక్కో బాటిల్‌పైన రూ.20లు అదనంగా వేసుకొని విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో కస్టమర్ నుంచి మరో రూ.30లు అదనంగా వేసుకొని అమ్ముతున్నారు.

పట్టించుకోని అధికారులు..

మద్యం విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నా సంబంధిత ఆబ్కారీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మద్యం దుకాణాలకు అనుబంధంగా బిర్యానీ సెంటర్లు, తినుబండారాలు, షోడాల సెంటర్లు ఏర్పడుతున్నాయి. బెల్ట్‌షాపుల్లో బహిరంగానే మద్యం సిట్టింగులు నడుస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదని, వస్తే చర్యలు తీసుకుంటామని చెపుతుండటం గమనార్హం.

ఎమ్మార్పీని మించి అమ్మితే చర్యలు
రాజశేఖర్, ఎక్సైజ్ సీఐ, అశ్వారావుపేట

ఎమ్మార్పీ ధరల కంటే అదనపు ధరలకు మద్యం అమ్మకాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. బెల్ట్‌షాపుల గురించి మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మాపై వచ్చే ఆరోపణల్లో వాస్తవం లేదు. నిబంధనలకు వ్యతిరేకంగా ఏమి జరిగినా చర్యలు తీసుకుంటాం.



ఓ బెల్టు షాపులో మద్యం సీసాలు

ఉపకారవేతనాల దరఖాస్తు గడువు పెంపు



ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసేందుకు మార్చి 31 వరకు తుది గడువు పెంచినట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకుడు కస్తాల సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ప్రతీ విద్యార్థి ఆధార్ సీడింగ్ కలిగిన బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని సూచించారు. ప్రతి కళాశాల ప్రధానాచార్యులు డిజిటల్ కీ కొనుగోలు చేసి ఈ పాస్ వెబ్ సైట్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులు డిజిటల్ సంతకాల ద్వారానే జిల్లా అధికారి లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని తెలిపారు.

మైనారిటీ గురుకులంలో విద్యార్థులతో వెట్టి

- బలవంతంగా పనులు చేయిస్తున్న అధికారులు



గోడలకు సున్నం, రంగులు వేస్తున్న విద్యార్థులు

ఇల్లెందు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పి చదువుల్లో రాణించే లా తీర్చిదిద్దాల్సిన గురుకుల పాఠశాల ఉపాధ్యాయులే విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ఇల్లెందు పట్టణంలోని 24 ఏరియాలో గల మైనార్టీ బాలుర గురుకులంలో కొంతకాలంగా 5, 6 తరగతుల విద్యార్థులతో వివిధ రకాల పనులు చేయిస్తున్నారు. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన మైనార్టీ డే వేడుకలకు ముందు పాఠశాల గోడలకు సున్నాలు, రంగులు వేయించడంతోపాటు ఇతర పనులను చేయించారు. ప్రతీరోజు ఉదయం ఆటోల నుంచి సామగ్రిని దించి వంట రూముల్లోకి తీసుకెళ్లే పనులను కూడా విద్యార్థులతోనే చేయిస్తున్నారు. ఖాళీ గిన్నెలను సైతం శుభ్రం చేయించే పనులు విద్యార్థులతో చేయిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

మైనార్టీ డే రోజే పనులు: కృష్ణ, ప్రిన్సిపాల్

మైనార్టీ డే సందర్భంగా విద్యార్థులను చిన్న చిన్న అవసరాలకు వినియోగించుకోవచ్చనే సూచనల మేరకే వ్యవహరించాం. ఇతర పనులు చేసేందుకు ఎలాంటి బడ్జెట్ ఉండదు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో పరిశుభ్రతతోపాటు పచ్చదనం కోసం పని చేసే వీలుంది. కావాలని విద్యార్థులతో పనులు చేయించలేదు.

కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

మణుగూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ఏరియాలోని దుర్గా కంపెనీలో ప్రమాదం సంభవించి ఓ కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈఘటన జరిగి నాలుగు రోజులు కావస్తున్నా దుర్గా నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. నాలుగు రోజుల క్రితం టైర్ సెక్షన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేసే విప్పల సింగారం ప్రాంతానికి చెందిన రాముపై సన్నీ టైర్ మీద పడటంతో రెండు కాళ్ల తొడ ఎముకలు విరిగినట్లు సమాచారం. వెంటనే క్షతగాత్రుణ్ని భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి గుట్టు చప్పుడు కాకుండా చికిత్స చేయిస్తున్నట్లు తెలిసింది.

కూచిపూడి శిక్షకురాలు వరలక్ష్మి మృతి

భద్రాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన కూచిపూడి నృత్య శిక్షకురాలు ఉప్పలూరి వరలక్ష్మి(56) అనారోగ్య కారణాలతో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో మృతి చెందారు. మూడున్నర దశాబ్దాలుగా భద్రాచలం డివిజన్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఎందరో విద్యార్థులకు కూచిపూడి నృత్యాన్ని వరలక్ష్మి నేర్పారు. మూడువేలకు పైగా నాట్య ప్రదర్శనలు తన శిష్య బృందంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించారు. భద్రాచలంలో మొట్టమొదటి కూచిపూడి నృత్యకళాకారిణిగా ఆమె గుర్తింపు పొందారు.

అన్నివర్గాల ప్రజల సంక్షేమమే

కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ



నాయుడు సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వైరా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి జాతీయ ప్రధాన రహదారి మీద క్రాస్‌రోడ్డు వరకు అక్కడి నుంచి వాసవీ కల్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహించి డప్పువాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ ర్యాలీలో నాయుడు సత్యనారాయణ, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ అభివాదం చేశారు. అనంతరం జరిగిన అభినందన సభలో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి సహకారంతో తనకు ఈ చైర్మన్ పదవి వచ్చిందని, వైరా వాసిగా గర్వంగా ఉందని ఇది కాంగ్రెస్ కార్యకర్తలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని చెప్పారు.

నగరంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉపకేంద్రాల నిర్వాహణ సందర్భంగా సోమవారం ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు చెప్పారు. దాన్వాయిగూడెం ఫీడర్ మరమ్మతులతో సారధినగర్, రామాలయం వీధి, సాయిబాబా దేవాలయంలైన్, బీరప్ప దేవాలయం, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లీస్కూల్, బూబ్లీపురం ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. బుర్హాన్‌పురం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా మామిళ్లగూడెం, మామిడిగూడెం, బుర్హాన్‌పురం ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదని చెప్పారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	18 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	30
బీరకాయ	50
పచ్చిమిర్చి	44
కాకరకాయ	48
బెండకాయ	44
పొట్లకాయ	38
దోసకాయ	34-38
చిక్కుడు	54
నాటుచిక్కుడు	90
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	64-70
సొరకాయ	28
క్యారెట్	44
క్యాప్సికం	64
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

ఊపందుకున్న మినీస్టేడియం పనులు

- చిన్నవెంకటగిరిలో త్వరలో అందుబాటులోకి
- సుమారు రూ.25 కోట్ల అంచనాతో పనులు
- గత ఫిబ్రవరిలో మంత్రి పొంగులేటి శంకుస్థాపన



ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న పనులు

ఖమ్మంరూరల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నవెంకటగిరిలో గ్రీన్ ఫీల్డ్ మినీస్టేడియం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఐదెకరాల్లో ఈపనులకు రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు.వీలైనంత తొందరగా పూర్తి చేసి క్రీడాకారులకు అందించాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు పనులు ముమ్మరంగా చేయిస్తున్నారు.

భారీ అంచనాలతో..

ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి పరిధిలో మోడల్ క్రీడామైదానం నిర్మాణానికి గత ప్రభుత్వం పూనుకుంది. సుమారు రూ.25 కోట్లు అంచనా వ్యయంతో పనులు చేపట్టాలనుకుంది. ప్రతీ నియోజకవర్గానికి ఒక మినీస్టేడియం ఉండాలని భావించింది. అందులో భాగంగా నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలో మినీస్టేడియం నిర్మాణానికి ఆరెకరాల స్థలాన్ని కేటాయించింది. తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మోడల్ క్రీడా మైదాన స్థలాన్ని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలకు కేటాయించారు. మోడల్ క్రీడా మైదానానికి స్థలం కరువైంది. చెరువుమాదారంలో స్థలాన్ని కేటాయించినా ఆ ప్రాంతం పాలేరు నియోజకవర్గానికి ఓమూలన ఉండటంతో దాన్ని విరమించుకున్నారు. మద్దులపల్లి వద్ద మోడల్ క్రీడామైదానం, చెరువుమాదారం మిని స్టేడియం నిర్మాణ ప్రతిపాదనలను రద్దు చేశారు. అనంతరం రూరల్ మండలం, చిన్న వెంకటగిరిలో ఐదెకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ మినీ క్రీడా మైదానం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో ప్రస్తుతం ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు. కబడ్డీ కోర్టు, రెండు షటిల్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. స్థలం చుట్టూ వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌లు నిర్మిస్తారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్‌రావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతు మినీ క్రీడామైదానంలో ఇండోర్ స్టేడియం పనులను నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందించామన్నారు.

పోస్టల్ స్కీములను సద్వినియోగం చేసుకోవాలి

కామేపల్లి, జనవరి5 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ స్కీములను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి అన్నారు. కొమ్మినేపల్లి పోస్టల్ కార్యాలయంలో మాట్లాడారు. ఘనచరిత్రగల తపాల శాఖలో 164972 శాఖలు పనిచేస్తున్నాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అద్భుతమైన పథకాలు ప్రవేశపెట్టి అందరి మన్ననలను పొందుతు సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పమ్మి వెంకటేశ్వర్లు, ఎస్ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, జనవరి5(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికి ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, ఇళ్లు ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పిండిప్రోలులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి5(ఆంధ్రజ్యోతి): గంగపుత్రలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మేయర్ నీరజ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ నీరజ మాట్లాడుతూ గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గంగపుత్రుల కోసం ప్రత్యేకంగా ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేయడమే కాక అధిక లాభాలు పొందేలా ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు అందరిని సమాన దృష్టిలో చూస్తారని, వారి ఎదుగుదలకు కృషిచేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, గంగపుత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం ప్రసన్నకృష్ణ, కార్పొరేటర్ కన్నం వైష్ణవి, దేశబోయిన సురేష్, పెద్దపల్లి సుధాకర్, పాక ఓంప్రకాష్, పాకల ఉపేందర్, అంబటి సుధాకర్, దేశబోయిన తిరుపతయ్య, వంగాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'జయహో జానపదం'

ఖమ్మంసాంస్కృతికం,జనవరి5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం అవదూతేంద్ర మణికంఠ భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో జానపదం కార్యక్రమం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. పల్లె పాటలు, జానపద గీతాలతో సుదీర్ఘంగా ఆరుగంటల పాటు నిర్వహించిన పాటల కార్యక్రమం జీనియస్‌బుక్, తెలుగు బుక్ఆఫ్‌రికార్డ్స్‌లలో నమోదయ్యింది. మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నిరాటంకంగా పాటలు పాడుతూ జానపద కళాకారులు పేరం నవీన్, నాగసాయి రికార్డు నమోదు చేశారు.కార్యక్రమంలో వండర్ బుక్ఆఫ్‌రికార్డ్స్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ గాయకులకు ధృవపత్రాలను అందజేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎర్రుపాలెం యువతి



ఎర్రుపాలెం,జనవరి5(ఆంధ్ర జ్యోతి):మండలంలోని ఎర్రుపాలెం గ్రామానికి చెందిన చిత్తలూరి చంద్రకళ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ మహిళల విభాగంలో ఈనెల 4న కల్లూరు మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి ఎంపికలు జరిగాయన్నారు. వరంగల్‌లో ఈనెల 7నుంచి పదో తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నూతన ఆర్థిక విధానాలతోనే

నిత్యావసరాల ధరలు పెరుగుదల

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): నూతన ఆర్థిక విధానాలవల్లే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం డివిజన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచబ్యాంక్ సంస్కరణలను వేగవంతంగా మోదీప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. బీజేపీ పాలనలోనే పెట్రోలు, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రజల కష్టాలు పట్టించుకోకుండా, మతాన్ని అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాలని నున్నా నాగేశ్వరావు పిలుపునిచ్చారు. సీపీఎం వర్క్‌షాప్‌లో రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు ఎంఏ. జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, మీరాసాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్‌పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

- ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గసభ్యుడు రామకృష్ణ

ఖమ్మంటౌన్, జనవరి5(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న సమగ్రశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో అక్కడి విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 22రోజుల నుంచిసమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీంతో సదరు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారన్నారు. వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న తరుణంలో విద్యార్థులకు ఇంకా సిలబస్ కాకపోవడంతో పాఠాలు బోధించే ఉపాధ్యాయులు సమ్మె చేయడంతో వారు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వెంటనే ఉద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కారం చేయకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్,వంశీ, జిల్లా కార్యవర్గసభ్యులు హరికృష్ణ, రవి, గణేష్, సాయి, నాగరాజు, గోపి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంగళరావు



ఖమ్మంఖానాపురంహవేలి/నేలకొండపల్లి,జనవరి5(ఆంధ్రజ్యోతి):టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తేజావత్ వెంగళరావు ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఈఎన్నిక జరిగింది. ఇప్పటి వరకు జిల్లా కార్యదర్శిగా పని చేసిన వెంగళరావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. నేలకొండపల్లి మండల పరిధిలోని అమ్మగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా వెంగళరావు పని చేస్తున్నారు.

శిథిల భవనం కూల్చేదెన్నడో?

బీరోలు పాఠశాలలో ప్రమాదకరంగా పాతభవనం



తిరుమలాయపాలెం, జనవరి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరోలు ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పాత భవనం ప్రమాదకరంగా మారింది. పాఠశాలలో ఈ పాతభవనాన్ని అధికారులు కూల్చివేయాల్సి ఉండగా, ఆ దిశగా కార్యాచరణ చేయకపోవటంతో అది ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం విద్యార్థులు ఆభవనం పక్కనుంచి వెళుతుంటారు. ఈనేపథ్యంలో వర్షానికి తడిచి ఎండకు ఎండుతూ ఎప్పుడు కూలిపోతుందోనని తెలియని పరిస్థితి. విద్యార్థుల తల్లిదండ్రులుఅధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం

జాతీయ కరాటే పోటీలను ప్రారంభించిన మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని కరాటే నేర్చుకోవటం ద్వారా మహిళలకు మనోధైర్యం కలుగుతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు.ఆదివారం ఖమ్మం షాదిఖానాలో పల్లా జాన్‌రాములు మెమోరియల్ జాతీయ కరాటే పోటీలను మేయర్ ప్రారంభించారు. ఏటా ఇటువంటి పోటీలు నిర్వహించటం అభినందనీయమని నిర్వాహకులను మేయర్ అభినందించారు. బాలికలకు కరాటేపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉప మేయర్ ఫాతిమాజోహారా, నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ నీరజ

కార్మికులకు అండగా కాంగ్రెస్

ఐఎన్‌టీయూసీ సమావేశంలో తుమ్మల యుగంధర్

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి5(ఆంధ్రజ్యోతి): కార్మికులకు హక్కులు, చట్టాలను అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకే ఉందని కార్మికులకు ఎప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం సరైన న్యాయం చేస్తోందని అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. నాయకులు నరాల నరేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ నాయకుడు యుగంధర్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కామేపల్లి, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చర్ల ఎంజేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 31యేళ్ల క్రితం పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముచ్చర్లలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 1993-94లో చదివిన కలుసుకున్నారు. గత అనుభవాలను పంచుకున్నారు. నాటి గురువులు జానకి రామయ్య, శర్మ, క్రిష్టాఫర్, రామారావు, మదుసుదన్‌ను సన్మానించారు. అనంతరం పాఠశాలకు రూ.15వేల విలువగల ఇనుప బీరువాను అందజేశారు. ఈకార్యక్రమంలో నాగుబండి మనోహర్‌బాబు, మల్లికార్జున్‌రావు, లింగం శ్రీనివాసరావు, కోల లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.



ముచ్చర్లలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

పేకాట స్థావరాలపై దాడులు

ఖమ్మంక్రైం,జనవరి5(ఆంధ్రజ్యోతి):నగర పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నగర పరిధిలోని బల్లేపల్లి చెరువు పక్కన ఉన్న ఒక ఖాళీస్థలంలో కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఖమ్మం నగరానికి చెందిన ధరావత్ సురేష్‌బాబు, ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు, మొగిలి ఉపేంద్రరావు, కె.సురేష్ బాబు, పగడాల శివకృష్ణ,ఎం.శృతిఅనే మహిళ కూడా పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. దీంతో ఖానాపురంహవేలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.22,020, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

మూడు సెల్‌ఫోన్లు మూడు వేలనగదు, ఏడు బైక్‌ల సీజ్

రఘునాథపాలెం: పోలీసులు వ్యూహాత్మకంగా పేకాట స్థావరంపై దాడిచేయటంతో ఏడు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు, మూడు వేల నగదును సీజ్‌చేశారు. కొంతకాలంగా ఖమ్మం నగరంలోని పేకాటరాయుళ్లు రఘునాథపాలెం మండలాన్ని సేఫ్‌జోన్‌గా ఎంచుకున్నారు. రఘునాథపాలెం సమీపంలో ఉన్న మామిడి తోటలో జోరుగా పేకాట నిర్వహిస్తున్నారని ఆరోపణలు రావటంతో ఆదివారం సీఐ ఉస్మాన్‌షరీఫ్ ఆకస్మిక దాడులు చేశారు. ఏడు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు, మూడువేలు సీజ్ చేశారు.

మట్కా ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

ఖమ్మంక్రైం,జనవరి5(ఆంధ్రజ్యోతి): మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. నగరంలోని పీఎస్ఆర్ రోడ్‌లోని ఓ ఇంటిలో మట్కా ఆడుతున్నారని సమాచారం రావడంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.1500 స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

గౌడ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయడు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి5(ఆంధ్రజ్యోతి): గౌడ్‌ల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయడు సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో జిల్లాగౌడసంఘం ఆధ్వర్యంలో నాయుడు సత్యనారాయణగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గౌడ్ యెక్క సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, గౌడన్నల సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. జిల్లా నుంచి గౌడబిడ్డను చట్టసభలకు పంపుదామని దానికి అందరి సహకారం తీసుకోవాలన్నారు. మాజీఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్ మాట్లాడుతూ అన్ని గౌడ సంఘాలను ఏకం చేసి పనిచేయాలన్నారు. గౌడవిద్యార్థుల వసతికోసం త్వరలోనే గౌడ హాస్టల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామన్నారు. తెలంగాణ గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు కత్తినెహ్రూగౌడ్ మాట్లాడుతూ సమాజంలోని వివిధ రంగాల వృత్తి నిపుణులను ఐక్యంచేస్తూ విద్యా, ఉద్యోగ, ఉపాధి మరియు రాజకీయ రంగాల్లో గౌడన్నలు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు పోతగాని కృష్ణారావుగౌడ్, రేఖల భాస్కరరావుగౌడ్, వడ్డెబోయిన నరసింహారావుగౌడ్, వత్సవాయి రవిగౌడ్, నూతి సత్యనారాయణగౌడ్, బోడపట్ల వెంకన్నగౌడ్, శ్రీనివాసరావుగౌడ్, గోపా రాష్ట్రఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి రామక్రిష్ణ పాల్గొన్నారు.



సత్యనారాయణగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు



చదరంగంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి బహుమతులు అందిస్తున్న ఎంఈవో రాజేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థినీలు చదరంగం పోటీలలో సత్తాచాటారు. ఈనెల 4వ తేదీన మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో జోనల్‌స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీల్లో బహుమతులు సాధించిన పీ.జాహ్నవి, పీ.లాస్య, ఎస్‌డీ.సన, కే.జెస్సీ, కే.ధనవర్షలతో పాటు పీడీ శ్రీదేవీలను ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకుడు చెరుకు శ్రీనివాసరావులు అభినందించారు.

మండల స్థాయిలో నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో తుంబూరు జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి విద్యార్థిని పీ.కారుణ్య మొదటి బహుమతి గెలుపొందినట్లు హెచ్‌ఎం డీ.దయాకర్‌రెడ్డి తెలిపారు.

తెగులు..దిగులు

» ఎర్రనల్లితో బెంబేలెత్తుతున్న మిరప రైతులు
» ఆందోళనతో పలు రకాల మందులు పిచికారి
» ఎండిపోతున్న పంట » దిగుబడులపై తీవ్ర ప్రభావం



తెగుళ్లు సోకిన మిరప పంట

బోనకల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): మాయదారి ఎర్రనల్లి మిరప రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. పలు రకాల మందులను పిచికారి చేసినా అదుపులోకి రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పైరు ఎండిపోతుండటంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది. జిల్లాలో వ్యవసాయ మండలంగా పేరున్న బోనకల్ మండలంలో 5వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. వాతావరణం అన్ని విధాలుగా అనుకూలించడంతో ఈ ఏడాది మిరప తోటలు బాగున్నాయని రైతులు ఎంతగానో సంతోషించారు. ఆశల సాగులో ఎర్ర బంగారం తమ కష్టాలను తీరుస్తుందని ఇంటిల్లాపాది భావించారు. ఇటీవల మిరప రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎకరానికి లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టారు. పైరు మంచి కాపు, పూత దశలో ఉంది. అనుకోని విధంగా ఎర్రనల్లి పైరును ఆశించడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. కాయలు గిడసబారుతున్నాయి. నల్లిని అదుపులోకి తీసుకువచ్చేందుకు గానూ రైతులు తిరగని దుకాణం లేదు, కొట్టని మందు లేదు. పలుమార్లు మందులు పిచికారి చేస్తుండటంతో ఎకరానికి రూ.20వేల వరకు అదనపు ఖర్చు వస్తుంది. అయినా పైరు ఎదుగుదల లోపించి ఎండిపోతుండటంతో రైతులు ఏం చేయాలో పాలుపోక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి మిరప సాగు చేస్తే ఎర్రనల్లి తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలుమార్లు పిచికారి చేసినా ఎర్రనల్లి అదుపులోకి రావడం లేదు

● మరీదు శ్రీకాంత్, రైతు, బోనకల్



నాలుగు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. పైరు మంచి పూత, కాపు దశలో ఉండగా ఎర్రనల్లి సోకింది. నివారణ కోసం పలు రకాల మందులను పిచికారి చేస్తున్నా తగ్గడం లేదు. ఏం చేయాలో పాలు పోవడం లేదు. పంట చేతికందే తరుణంలో ఎర్రనల్లి వలన దిగుబడి తీవ్రంగా తగ్గనుంది. చేసిన అప్పులు ఎలా తీరతాయో అర్థం కావడం లేదు. ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేదు.

విప్పలమడక పీఏసీఎస్‌ను పునరుద్ధరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

వైరా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల కిందట గరికపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో విలీనం చేసిన విప్పలమడక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ను పునరుద్ధరించాలని విప్పలమడక, లింగన్నపాలెం గ్రామాలకు చెందిన అఖిలపక్షాల నాయకులు, రైతులు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను కోరారు. ఆదివారం వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సహకార వ్యవస్థ ఏర్పడి నాటి నుంచి విప్పలమడక, లింగన్నపాలెం గ్రామాలు కలిపి విప్పలమడక కేంద్రంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం 50 సంవత్సరాలపాటు ఎంతో లాభసాటిగా రైతులకు సేవలందించిందని పేర్కొన్నారు. అయితే 20ఏళ్ల కిందట సహకార వ్యవస్థలో వచ్చిన మార్పులు, లాభనష్టాలను పరిగణలోకి తీసుకొని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు కుదించి విప్పలమడక సహకార సంఘాన్ని గరికపాడు సంఘంలో విలీనం చేశారని గుర్తు చేశారు. గరికపాడు సహకార సంఘానికి వెళ్లి రావాలంటే తమ రెండు గ్రామాలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని పేర్కొన్నారు.

ఇటీవల రూ.20లక్షలతో విప్పలమడకలో తమ రెండు గ్రామాల అవసరాలను తీర్చేవిధంగా గోదామును కూడా నిర్మించారని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాలను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియను ప్రారంభించినందున విప్పలమడక సహకార సంఘాన్ని కూడా పునరుద్ధరించే విధంగా రాష్ట్ర, జిల్లా సహకార సంఘాల అధికారులకు సిఫార్సు చేయాలని ఆవినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే విప్పలమడక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, అఖిలపక్ష నాయకులతోపాటు కాంగ్రెస్ నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, కట్ల సంతోష్, వడ్డే నారాయణ, ధార్న రాజశేఖర్, పాలేటి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం

బోనకల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా జనరల్ వైద్య నిపుణులు పవన్ కుమార్ మాట్లాడుతూ బత్తినేని ట్రస్టు పేదల కోసం ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయంగా పేర్కొన్నారు. ఆరోగ్య నియమాలను పాటించడం ద్వార బీపీ, షుగర్ వ్యాదులను అదుపులో ఉంటాయన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు తూము రోషన్ కుమార్, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బొమ్మినేని కొండలరావు, ఆకేన పవన్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజబాపయ్య వీధిలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియోపతి వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రతినెలా మొదటి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కన్వీనర్ చీకటి వెంకటరామారావు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 55మందికి వైద్యులు తిరుపతయ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వజినేపల్లి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సురేష్, తనూజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజనం తయారీ నాణ్యతపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా భోజనం సరిగా ఉండటం లేదని, ఉడికి ఉడకని అన్నం తినడంతో కడుపులో నోప్పి వస్తుందని విద్యార్థిలు ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. 600 మంది విద్యార్థులకు కేవలం 6 కేజీల కంది పప్పును వండించారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గుత్తేదారునిపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. ఇంకా పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం సక్రమంగా లేవని, కోతుల బెడదతో భయం భయంగా కాలం గడపాల్సి వస్తుందని విద్యార్థులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మరుగుదొడ్లను ఆధునీకరణ చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. కోతుల బెడదను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేలా పర్యవేక్షణ చేయాలని పాఠశాల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీ రాజదేవి, కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, పాపబత్తిని నగేష్, బాగం ప్రభాకరచౌదరి, భూక్యా శివకుమార్‌నాయక్, పెద్దబోయిన శ్రీనువాసరావు, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకులు జీవితాలను నాశనం చేసుకోవద్దు

» పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ. రాకేష్

కారేపల్లి, జనవరి5 (ఆంధ్రజ్యోతి): యువకుల జీవితాలను నాశనం చేస్తున్న బెట్టింగ్ యాప్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రాకేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో బెట్టింగ్ యాప్‌లపై యువకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు బెట్టింగ్‌లు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారని, దీంతో తల్లిదండ్రులు మనోవేదనతో కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రాము, ప్రశాంత్, ప్రవీణ్, భరత్, హరి, దేవరాజు, ఉదయ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

కారేపల్లి, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాగ్యనగర్‌తండాలో గల శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన నూతన కమిటీని ఆదివారం ఎనుకున్నారు. చైర్మన్‌గా గ్రామానికి చెందిన ధారవత్ కళ్యాణ్‌తో పాటు మరో 21మంది సభ్యులతో కూడిన కమిటీని గ్రామస్థులు ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ ఏడాది పాటు పదవీలో కొనసాగుతుందన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన కళ్యాణ్‌ను గ్రామస్థులు అభినందించారు.

రెండు జిల్లాల స్థాయి యోగా పోటీలు



మాట్లాడుతున్న ఎంఈవో అబ్రహం

కొణిజర్ల, జనవరి5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యోగా ప్రచార సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండుజిల్లాల స్థాయి యోగా పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో అబ్రహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. పోటీలు అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ళ పూర్వ విద్యార్థులసంఘం అధ్యక్షులు లేడిబోయిన గోపాలరావు, నిర్వాహకురాలు ఝాన్సీ, తనికెళ్ల పీడీ దొండపాటి శ్రీనివాస్, యోగా ప్రచార సమితి సభ్యులు ప్రసాద్, యష్పాల్, పాపిరెడ్డి, యోగా గురువులు గోమలాపురం సత్యనారాయణ, కోదండరాం, సరిత, పద్మ, శిరీష, డిస్టిక్‌లీగల్ సర్వీస్ అథారిటి పర్సన్ పొలిశెట్టి పద్మావతి, చలమల హైమావతి, లక్ష్మీకాంతమ్మ, పర్వతారోహలు, మోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ఎల్ఐసీని అగ్రగామిగా నిలబెడదాం

» వరంగల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం

వైరా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)ను అగ్రగామిగా నిలబెడదామని ఆసంస్థ వరంగల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన వైరా పరిసర ప్రాంతాల ఎల్ఐసీ ఏజంట్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో వరంగల్ సేల్స్ మేనేజర్ రవిశంకర్, మధిర బ్రాంచ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, డవలప్‌మెంట్ ఆఫీసర్లు ఎం.సుధాకర్, రవికుమార్, జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, లోకేష్, మహేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సత్తుపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ కళాశాలలో 1989-90నాటి ఎస్ఎస్‌సీ బ్యాచ్ కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించింది. 35ఏళ్ల తర్వాత తమ తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సమ్మేళనంలో బుల్లితెర నటుడు ఎస్ఎస్.చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఓ మిత్రుడి ఇంట ఆడపిల్ల పెళ్లికి రూ.10వేలు సహాయం అందించేలా ఫౌండేషన్‌ను అప్పటికప్పుడు నిర్మించగా వీరపనేని బాబీ రూ.లక్ష ప్రకటించారు. మిగలిన వారు రూ.10వేలు అందించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో చింతలపాటి శ్రీనివాసరావు, రుత్తల వెంకటేశ్వరరావు, ఆయూబ్, రామిశెట్టి శేఖర్, కూసంపూడి మధు, మోమిన్, శ్రీనివాసరావు, ఎండీ.యాసిర్, యుగంధర్, దేవదానం, షాజహాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎర్రుపాలెం యువతి ఎంపిక



ఖోఖో పోటీలకు ఎంపికైన చంద్రకళ

ఎర్రుపాలెం, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రుపాలెం గ్రామానికి చెందిన చిత్తలూరి చంద్రకళ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంజిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళల విభాగంలో ఈనెల 4న కల్లూరు మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఎంపికలు జరిగాయన్నారు. వరంగల్‌లో ఈనెల 7వతేదీ నుంచి పదో తేదీ వరకు జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

» ఏడుగురి అరెస్టు
» ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం

ఎర్రుపాలెం, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో కోడిపందేల నిర్వహిస్తున్న జూదగాళ్లపై ఆదివారం దాడి చేసి పోలీసులు పట్టుకున్నారు. ఎర్రుపాలెం ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం రామాపురం గ్రామశివారులో కోడిపందేలు వేస్తున్నట్టు సమాచారం మేరకు పందేల స్థావరంపై దాడి చేసినట్టు తెలిపారు. ఈదాడిలో గ్రామానికి చెందిన ఏడుగురు జూదగాళ్లను, రెండు కోడిపుంజులను, రూ.8,660 నగదు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. విచారణ అనంతరం కోర్టుకు తరలిస్తామన్నారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ పండుగ పేరుతో కొందరు అత్యుత్సాహంతో అడ్డగోలుగా విచ్చలవిడిగా కోడిపందేలు వేస్తున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసకుంటామని తెలిపారు.

కాపులంతా సంఘటితంగా ఉండాలి

» మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు రామనరసింహారావు

కల్లూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులంతా సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దబోయన రామనరసింహారావు అన్నారు. ఆదివారం కల్లూరులో మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కాపులంత ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. తనకు జిల్లా కాపు సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేసిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు లక్కినేని రమేష్, కల్లూరు పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు బయ్యారపు నరేందర్ ఆధ్వర్యంలో బీసీ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాసా శ్రీకాంత్, బత్తుల కోటయ్య, కిష్టంశెట్టి కొండలరావు, షర్రాబు వెంకటేశ్వరరావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, వలసాల మణి పసుపులేటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

తల్లాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నిత్యావసర వస్తువులను మండలంలోని నారాయణపురం గ్రామంలో అభిరామిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ మనుమడు అభిరామిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని శీలం శ్రీనివాసరెడ్డి నిరుపేదలైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ సెక్రటరీ కటికి వెంకటేశ్వర్లు(కేవీ), ట్రెజరరీ శీలం వెంకటరెడ్డి, డీసీలు కర్నాటి లక్ష్మారెడ్డి, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, గుర్రాల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

'జర్నలిస్టులు నైతిక విలువలతో పనిచేయాలి'

తల్లాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు నైతిక విలువలతో పనిచేయాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి నారాయణ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్ సూచించారు. ఆదివారం తల్లాడ సొసైటీ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కొందరు జర్నలిస్టులు సమావేశాలు, సభల పేరుతో మండలంలో సంచరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడటం సరైంది కాదన్నారు. మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలను కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎండీ.ముస్తఫా, మోదుగు జయరాజు, చలపతిగౌడ్, రుద్రాక్ష నర్సింహాచారి, షేక్.మెహరాజ్, గొడ్ల శ్రీనివాస్, గొల్లమందల నాగరాజు, కాంపాటి రవి, ఇనపనూరి కుటుంబరావు, అద్దంకి సురేష్, మేడి యాకూబ్, ప్రసాద్, ప్రేమ్‌కుమార్, సైదా ఉన్నారు.

ప్రతిభా పరీక్షల్లో టేకులపల్లి విద్యార్థి ప్రతిభ



మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రూపస్

పెనుబల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో టేకులపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని మౌనిక జిల్లాస్థాయిలో తృతీయస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. తృతీయ స్థానం సాధించిన మౌనికకు రూ.వెయ్యి నగదుతోపాటు సర్టిఫికెట్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ రూపస్ అందజేశారు. ఈనెల 21న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మౌనికను పంపనున్నట్లు ఆయన తెలిపారు. సహాయ సహకారాలు అందజేసిన గైడ్ టీచర్ శ్రీదేవి, రాంప్రసాద్, నాగమణి, రాంబాబులను ప్రత్యేకంగా అభినందించారు.

రచయిత వీరభద్రారెడ్డికి సన్మానం

వైరా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన పాలేరు శతకం కావ్యగాన రచయిత నల్లపురెడ్డి వీరభద్రారెడ్డిని ఆదివారం సన్మానించారు. పాలేరు రిజర్వాయర్ ఆయకట్టు రైతుల స్థితిగతుల గురించి వీరభద్రారెడ్డి పాలేరు శతకం కావ్యగానంలో విశదీకరించటాన్ని సన్మాన నిర్వాహకులు అభినందించారు. పాలేరు రిజర్వాయరే కాకుండా వైరా రిజర్వాయర్, ఖమ్మం ఖిల్లా, నగర చరిత్రల గురించి కూడా పుస్తకాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పమ్మి తిరుమలరావు, రాంబాబు, మురళీ, వెంకట్, శ్రీను, నాగేందర్, వెంకటేశ్వర్లు, కృష్ణరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

చింతకాని, జనవరి5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫారసుతో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ. 15 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, ఆళ్ల రవీందర్, కొత్తపల్లి బసవయ్య, నారపోగు కొండల్‌రావు, పర్చగాని సతీష్ తదితరలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

'దూరవిద్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'



విద్యార్థులతో మాట్లాడుతున్న స్టేట్ కోఆర్డినేటర్ జ్యోతి

వైరా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మధ్యలో చదువు మానేసిన వారు దూర విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ కోఆర్డినేటర్ ఆర్.జ్యోతి, జిల్లా కోఆర్డినేటర్ పాపారావులు అన్నారు. ఆదివారం వైరా రాగూర్ విద్యాసంస్థలకు చెందిన క్రాంతి జూనియర్ కళాశాలలోని ఇంటర్ దూర విద్యాకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు కృష్ణారావు, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసంఘం కమిటీ ఎన్నిక

సత్తుపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సత్తుపల్లి మండల అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది కొండపల్లి విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన మండల శాఖ సమావేశంలో ఎన్నికల ఆఫీసర్‌గా పీవీ.రమణారావు వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా పర్చ వెంకటకృష్ణప్రసాద్, ట్రెజరర్‌గా మాదిరాజు బంగార్రావు, గౌరవ అధ్యక్షులుగా చాత్రాతి కృష్ణమోహన్‌రావులతో పలువురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదిరాజు పుల్లారావు, ఎస్.శివరాంప్రసాద్, ఎస్ఎల్.నరసింహారావు, జీ.నాగభూషణం, కొడిమెల అప్పారావు, ఊటుకూరు వినోదరావు, ఎంఎస్ఆర్.శర్మ, వేణుగోపాలరావు, లక్ష్మణరావు తదితరులున్నారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం



వలీజాన్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు

వైరా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్రాయాత్రకు మక్కా వెళ్తున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండలశాఖ ఉపాధ్యక్షుడు షేక్.వలీజాన్‌ను ఆదివారం ఆసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వలీజాన్ ఉమ్రా యాత్ర విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శరత్‌బాబు, వైరా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పైడిపల్లి సత్యనారాయణ, టీవీ.కృష్ణయ్యసూరి, నాయకులు ఎన్.పెంటయ్య, కట్టా నర్సింహారావు, జి.సుబ్బయ్య, ఎస్.వెంకటేశ్వరరావు, చల్లా కృష్ణారావు, కె.పురుషోత్తమరావు, సీహెచ్.నాగేశ్వరరావు, షణ్ముకచారి, సాయిబాబా పాల్గొన్నారు.